ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు
5
మంగళవారం 14 అక్టోబరు 2025

రెండు రోజులే..!

- 16న జిల్లాకు ప్రధాని నరేంద్రమోదీ
- కర్నూలులో దేశంలోనే తొలి జీఎస్టీ-2.0 సభ
- పకడ్బందీ ఏర్పాట్లలో మంత్రులు, అధికార యంత్రాంగం
- రూపురేఖలు మారిన రాగమయూరి గ్రీన్‌హిల్స్



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

కర్నూలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16న ప్రధాని నరేంద్రమోదీ పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న మూడో ప్రధాని మోదీ. 1991-96 మధ్య నంద్యాల ఎంపీగా ఉన్న అప్పటి ఎంపీ పీవీ నరసింహారావు నంద్యాలలో పర్యటించారు. 2004లో ప్రధాని మన్మోహన్‌సింగ్ ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలో ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారు. 2019లో కర్నూలు నగరం ఎస్టీబీసీ మైదానంలో జరిగిన ఎన్నికల బీజేపీ అభ్యర్థి ప్రచార సభలో ప్రధాని మోదీ పాల్గొన్నా.. ప్రధాని హోదాలో అధికారిక పర్యటన కాదు. ప్రధాని హోదాలో ఉమ్మడి జిల్లా పర్యటనకు గురువారం రానున్నారు. అందులోనూ దేశంలోనే 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట నిర్వహించే జీఎస్టీ-2.0 సంస్కరణల తొలి సభ ఇది. సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అమరావతి, విశాఖ పర్యటనలకు మించి కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు తన సేనను రంగంలో దించారు. స్వయంగా ఆయనే ఇప్పటికే రెండు సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. సీఎం ఆదేశాలతో మంత్రులు, కూటమి ముఖ్యనాయకులు రంగంలో దిగారు. అతిథుల భద్రత, తరలివచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాని మోదీ పర్యటనకు మిగిలింది నేటితో రెండు రోజులే..!



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మంత్రుల పర్యవేక్షణలో ఏర్పాట్లు

కడపలో టీడీపీ మహానాడు, అనంతపురంలో సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యనాయకులు, మంత్రులు అక్కడే తిష్టవేసి ఏర్పాట్లు పర్యవేక్షించినా సక్సెస్ చేయడంతో ఆ జిల్లాల నాయకులదే కీలకపాత్ర. తాజాగా కర్నూలులో జీఎస్టీ-2.0 సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సభ నిర్వహించడం, ఈ సభకు ప్రధాని మోదీ హాజరు కానుండడంతో రాష్ట్ర ప్రభుత్వానికే కాదు, జిల్లా నాయకులకు కూడా ప్రతిష్ఠాత్మకంగా మారింది. దీంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, బీజీ జనార్దన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్ సహా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ప్రధాని పర్యటన ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అవసరమైనప్పుడల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి పక్కా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు లక్షలకు పైగా జన సమీకరణ చేస్తుండడంతో సభా ప్రాంగణానికి తరలించేలా రూట్స్ డైవర్షన్ కీలంగా మారింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఏర్పాట్లలో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. కలెక్టర్ ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం రేయింబవళ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. నేటి సాయంత్రంలోగా వంద శాతం పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

మిగతా 6వ పేజీలో

సమర్థవంతంగా పనిచేయాలి

- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఐఏఎస్ అధికారి వీర పాండియన్



మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి వీరపాండియన్

ఓర్వకల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేయాలని ప్రధానమంత్రి, ప్రోగ్రాం స్పెషలాఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీర పాండియన్ తెలిపారు. సోమవారం నన్నూరు రాగమయూరి గ్రీన్‌హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరుపై ఆయన సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌లో పని చేసేవారు 24 గంటలు షిఫ్టుల వారీగా డ్యూటీలు వేసుకోవాలన్నారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి టీముల నుంచి సమాచారం తెప్పించుకోవాలన్నారు. ప్రతి ఒక్క టీమ్ చేస్తున్న పని ఏరకంగా జరగాలో ఆ విధంగా జరుగుతుందా లేదా, సరైన సమయంలో పనులు మొదలు పెట్టారా లేదా అనే వివరాలను సేకరించి తెలియజేయడానికే కంట్రోల్ రూమ్‌లో టీములను ఏర్పాటు చేశామన్నారు. పవర్ పాయింట్ ద్వారా అధికారులకు ఆయన సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సిరి, ఐఏఎస్ అధికారి సునీతా దినేష్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ సందీప్, రఘువంశీ, సచిన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు



వీరపాండియన్‌తో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, పల్లా, ఎదురూరు విష్ణు

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



కర్నూలు నగరంలోని ఎస్ఏపీ క్యాంప్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో విధుల్లోకి చేరుతున్న ఎస్జీటీ శశికళ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు సోమవారం పాఠశాలల్లో విధుల్లో చేరడంతో కళకళలాడుతున్నాయి. గతంలో ఎప్పుడూ ఉపాధ్యాయ నియామకాలు జరగడంతో ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ముఖ్యంగా ఆదోని డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లోని పాఠశాలల్లో అత్యధికంగా పాఠశాలలో ఏకోపాధ్యాయులతో బోధన కొనసాగుతూ వచ్చేది. ఇక ఈ పాఠశాలలకు ఇద్దరి కంటే ఎక్కువగా ఉపాధ్యాయులు విధుల్లో చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం నియమించడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు వీలు కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీతో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2,590 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారు. ఈ ఉపాధ్యాయులందరూ సోమవారం ఉత్సాహంగా పాఠశాల విధులకు హాజరయ్యారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన పెంచుకోవాలి

కార్మిక శాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వర్లు



జీఎస్టీ 2.0పై ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ 2.0 ద్వారా వస్తువులపై తగ్గించిన ధరలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కార్మిక శాఖ ఉపకమిషనర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. కార్మిక శాఖ అధ్వర్యంలో శుక్రవారం రాజవిహార్ నుంచి సి.క్యాంపు, సి.క్యాంపు నుంచి కలెక్టరేట్ వరకు జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.గాయత్రి, ఉపాధి కల్పనాధికారి దీప్తి, సహాయ కమిషనర్ సాంబశివ హాజర య్యారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు తగ్గిన ధరలపై అవ గాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేఎంఎల్ గాయత్రి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సీతాలక్ష్మి, సహాయ అధికారులు హేమాద్రి, సమీర్‌బాషా, నీలిమ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు

కల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులును నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పి.విజయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. కర్నూలు డీఆర్ కార్యాలయంలో మార్కెట్ వ్యాల్యూ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వరప్రసాద్ సీనియర్ అసిస్టెంట్‌గా తిరిగి వెళ్లారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, టీడీపీ నాయకులు

రాష్ట్రాభివృద్ధే సీఎం లక్ష్యం

- జీఎస్టీ సంస్కరణలతో తగ్గిన ధరలు
- ప్రధాని కోసం సీమ ప్రజల ఎదురుచూపులు
- రాష్ట్ర జలవనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు
- టూరిజం కారిడార్‌పై సీఎం ఫోకస్
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలును డ్రోన్ హబ్‌గా మార్చేందుకు కృషి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని జలవనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీడీపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్మల మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గాయని, ఇలా జరగడం దేశంలోనే ఇదే తొలిసారి అని అన్నారు. రాయలసీమలో పరిశ్రమల కారిడార్‌ను అమలుచేసి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోట్ల నిధులను కేటాయించి పెండింగ్ పనులను పూర్తి చేసి నాలుగు ఉమ్మడి జిల్లాలకు సాగు, తాగు నీటిని అందించిందన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు టూరిజం కారిడార్‌పై ఫోకస్ పెట్టారని, అనంతపురం-కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రీశైలంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కానుందన్నారు. ప్రధాని మోదీ వస్తున్నందున చాలా అంచనాలు ఉన్నాయని, కర్నూలుకు మోదీ వరాలు ఇస్తారని ఆశిస్తున్నామన్నారు. మోదీ పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ రాకతో కూటమి ప్రభుత్వం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కర్నూలును డ్రోన్ హబ్‌గా ప్రభుత్వం మార్చనుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే దామచర్ల, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, కార్పొరేషన్ డైరెక్టర్లు కొంకతి లక్ష్మీనారాయణ, ధరూర్ జేమ్స్, పోతురాజు రవి, నంద్యాల నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటేశ్వర్లు, హనుమంతరావు చౌదరి, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

శ్రీశైలం పవిత్రతను కాపాడండి

- జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలగలసిన క్షేత్రం శ్రీశైలం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- సామాన్యులకు స్పర్శ దర్శనం కల్పిస్తాం:
- ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రమేష్‌నాయుడు
- ఘనంగా ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ రమేష్ నాయుడు

శ్రీశైలం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పవిత్రతను ధర్మకర్తల మండలి కాపాడాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం శ్రీశైలంలో చంద్రవతి కల్యాణ మండపంలో జరిగిన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారానికి ఆదోని ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విలేకరులతో మాట్లాడుతూ జ్యోతిర్లింగం, శక్తి పీఠం కలగలిసినది శ్రీశైల క్షేత్రం అని అన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఒక ఎన్‌జీవోను స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించిన చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు అధ్యక్షుడిగా ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. నూతన ధర్మకర్తల మండలికి శుభాకాంక్షలు తెలిపారు.

చెంచులకు అంకితం

తనకు వచ్చిన ధర్మకర్తల మండలి అధ్యక్షుడి పదవిని చెంచులకు అంకితం చేస్తానని శ్రీశైలం ధర్మకర్తల మండలి కొత్త చైర్మన్ రమేష్‌నాయుడు అన్నారు.

మిగతా 6వ పేజీలో



అనుబంధాలు విస్మరించి.. అమ్మను మరిచి..!

6

21 నుంచి పత్తి కొనుగోలు

- దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు
- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

7

గోనెగండ్లలో వైసీపీకి షాక్

పోస్టల్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) డైరెక్టు ఏజెంట్లుగా కమీషన్ ప్రాతిపదికన పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాలలో కమీషన్ పద్ధతిన డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఆ పైన చదివి 18 సంవత్సరాలు పూర్తి అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్ఫ్ హెల్ప్ యువత, నిరుద్యోగ యువతీ, యువకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు, ఆశా కార్యకర్తలు, విశ్రాంత ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 28 నుంచి 31 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు

పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఏజెంట్లకు కమీషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు డెవపల్‌మెంట్ ఆఫీసర్ హరికృష్ణారెడ్డి 7013029312 నెంబరును సంప్రదించాలని సూచించారు.

మహానందీశ్వరుని హుండీ ఆదాయం రూ.63 లక్షలు


హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం నిర్వహించిన హుండీ లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.63,84,938 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్షేత్రంలోని ప్రధాన ఆలయాల్లోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను అభిషేక మండపంలో లెక్కించారు. నగదుతో పాటు రెండు అమెరికన్ డాలర్లు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, పసుపుల సుబ్బారెడ్డి, వివిధ స్వచ్ఛంద సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో సభను జయప్రదం చేయాలి

- జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో ఆనందం
- రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ప్రధాని కర్నూలుకు రానున్న నేపథ్యంలో కూటమి నాయకులు సమన్వయంతో పని చేసి సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం స్థానిక టౌన్‌హాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆధ్వర్యంలో మోదీ పర్యటన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, పత్తికొండ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ అసెంబ్లీ పరిశీలకుడు అలం నర్సనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జీఎస్టీ తగ్గించడంతో అన్నివర్గాల్లో ఆనందం నెలకొందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు భారీగా జనసమీకరణ చేయాలన్నారు. వార్డులు, మండలాల వారీగా అన్ని గ్రామాల నుంచి ప్రత్యేకంగా బస్సులు, భోజన సౌకర్యం సభా స్థలం వద్దకు చేరిక తిరిగి అక్కడ నుంచి ఇంటికి వచ్చేంత వరకు పూర్తిగా బాధ్యత తీసుకుంటామన్నారు. జీఎస్టీ బహిరంగ సభ కర్నూలులో ఉంటుందని తెలిపారు. ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలానికి ప్రత్యేకంగా రావాలని సీఎం కోరినట్లు తెలిపారు. ఇలా రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. నియోజకవర్గ జనసమీకరణ ప్రత్యేక ఏర్పాట్ల పరిశీలకుడు పత్తికొండ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, శాప్ చైర్మన్ రవినాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అలం నర్సనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ సభకు వచ్చే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణంలో, వార్డుల్లో ఎన్ని బస్సులు అవసరమవుతాయో అధికారులు చూస్తారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెడికల్ క్యాంపులు, ఆహారం, నీళ్లు, సౌకర్యం అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు, బీజేపీ నాయకులు ఇంటి ఆదినారాయణ, కశెట్టి కృష్ణమూర్తి, జనసేన నాయకులు సుధాకర్, కూటమి నాయకులు ఖలీల్, దస్తగిరి కార్యకర్తలు పాల్గొన్నారు.

అరటి ధర పతనం


చిన్నవంగలిలో ధర లేక చెట్లకే ఉంచిన అరటి గెలలు

- టన్ను రూ.2 వేలు నుంచి రూ.5 వేలలోపే..
- తుఫాన్‌తో దెబ్బతిన్న తోటలు
- కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు

చాగలమర్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దిగుబడులు చేతికందే సమయంలో అరటి ధరల పతనం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో టన్ను రూ.24 వేలు పలికింది. జూలై నెలాఖరు వరకు టన్ను రూ.15 వేలు నుంచి రూ.19 వేలు వరకు పలికింది. అయితే ఆగస్టు నుంచి ధరలు పతనం మొదలయ్యాయి. ఈ ఏడాది నాణ్యతను బట్టి రూ.2. వేలు నుంచి రూ.5 వేలు వరకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ధర పతనమైనా కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క తుఫాన్ దెబ్బతో అరటి తోటలు దెబ్బతిని నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గెలలు కూడా మాగిపోతుండటంతో చెట్లకే గెలలను వదిలేశారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్ లేకపోవడం, ఇతర దేశాలకు ఎగుమతులు పరిమితంగా జరుగుతుండటం ధరల పతనానికి కారణమని వ్యాపారులు అంటున్నారు.

జిల్లాలో అరటి సాగు ఇలా..

నంద్యాల జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. చాగలమర్రి మండలంలో 800 ఎకరాలు, ఆళ్లగడ్డలో 20 ఎకరాలు, శిరివెళ్లలో 180, రుద్రవరం 480, నంద్యాల 140, ఉయ్యాలవాడ 30, పాములపాడు 35, కొత్తపల్లి 15, పాణ్యం 274, డోన్ 580, బేతంచర్ల 280, గడివేములలో 120, బండిఆత్మకూరు 220 మహానంది 6,010, బనగానపల్లె 20, కొలిమిగుండ్ల 280 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. ఎకరాకు సాగుకు రూ.60 నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. ఏడాది పాటు కంటికి రెప్పలా అరటి పంటను కాపాడుకుంటూ వస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ధరతో పాటు దిగుబడి కూడా తగ్గింది. సరాసరి 20 నుంచి 25 టన్నులు పైగా దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 10 టన్నులు మాత్రమే దిగుబడి వస్తోంది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు అరటి తోటలను దున్నేసేందుకు సిద్ధమయ్యారు. దిగుబడి, ధర బాగుంటే రైతుల కష్టాలు తీరుతాయి. లేకుంటే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు మిగులుతాయి. ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధర పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.


అరటి గెలలను లోడింగ్ చేస్తున్న కూలీలు

తుఫాన్ దెబ్బతో అరటి రైతు విలవిల

వాయుగుండ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో అరటి రైతులు కుదేలయ్యారు. అరటి కోత సమయంలో వర్షాలు అధికమవడంతో గెలలు కూడా దెబ్బతిని నాణ్యత లోపించింది. చెట్లకే పండ్లు మాగిపోయాయి. దీంతో రైతులు అరటి గెలలను విక్రయించుకోలేక నష్టపోతున్నారు. కొందరు రైతులు అరటి గెలలను చెట్లకే వదిలేశారు. మరి కొందరు రైతులు వ్యాపారులు అడిగిన ధరకే అమ్ముకుంటున్నారు. అరటివల్ల పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్‌సౌకర్యం కల్పించి అరటి గెలలను కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

దళారుల సిండికేట్

పంట దిగుబడి బాగుందని సంతోషించే లోపే దళారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేశారు. నెల రోజుల కిందట వరకు ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ పంట చేతికొచ్చే సమయానికి ధరలు కుప్పకూలాయి. బయట మార్కెట్‌లో కిలో రూ.30 విక్రయిస్తుండగా రైతుల వద్ద కిలో రూ.2 మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారడం వల్ల ధర పథనానికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు, దళారులు అడిగిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టపోయా



5 ఎకరాల్లో అరటి సాగు చేశా. దిగుబడి బాగుంది. పెట్టిన పెట్టుబడి వస్తుందని అనుకున్న లోపే ధరలు పడిపోయాయి. మంచి లాభం వస్తుందని ఆశించా. గెలలు కోసే సమయంలో ధరలు పడిపోయాయి. టన్ను రూ.2 వేలు కూడా పలకడం లేదు. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

దళారులతో నష్టపోతున్నాం



వ్యాపారులు సిండికేట్ కావడంతో ధర పతనానికి కారణం. వ్యాపారులు, దళారులు అడిగిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తోంది. మూడు ఎకరాల్లో అరటి సాగు చేశా. 2 లక్షలు పైగా పెట్టుబడి పెట్టాను అరటి గెలలు కోత సమయంలో ధరలు కుప్పకూలాయి. ధర తగ్గిన ఏదో ఒక రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు ముందుకు రాకపోతే పంటను దున్నేయాల్సి వస్తోంది. పరిహారం అందించాలి.

- అనిల్‌కుమార్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి




దెబ్బతిన్న అరటి గెలలను చూపిస్తున్న రైతు

రెండు రోజులే..!

(5వ పేజీ తరువాయి)

ప్రధానికి భద్రత కల్పించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) సోమవారం ప్రధాని మోదీ పర్యటన, భద్రతా ఏర్పాట్లపై రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సహా రోడ్లు, పార్కింగ్ స్థలాలను క్షుణంగా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సభికులకు ఇచ్చే ఆహారం, తాగు నీరు పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచనలు చేసినట్లు తెలిసింది.



సీసీ కెమెరాలతో డీజీపీ కార్యాలయం నుంచి నిఘా ఉంటుందన్నారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో నుంచి మూడు రోజుల పాటు 'నో ఫ్లై జోన్ ఫర్ డ్రోన్స్' గా ప్రకటించారు.

7,500 మంది పోలీసులతో భారీ భద్రత: ఎస్పీ

కర్నూలు క్రైం : ఈ నెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు 7,500మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ బందోబస్తు నిమ్మితం కర్నూలుకు వచ్చిన అడిషినల్ ఎస్పీలు, పోలీసు అధికారులతో పసుపుల రోడ్డులో ఉన్న యూబీఆర్ కన్వెన్షన్ హాలులో దిశానిర్దేశం చేశారు. భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పార్కింగ్ ప్రదేశాలు, బహిరంగ ప్రదేశం, రూట్ డైవర్షన్స్, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై వివరించారు. సెక్టార్ ఇన్‌చార్జిలుగా ఐపీఎస్ అధికారులు ఉంటారని, వారి వద్ద ఏఎస్పీ స్థాయి అధికారులు ఉంటారన్నారు. ప్రధాని బహిరంగ సభ వద్ద ఏడు మంది ఎస్పీ స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తారని, 200

శ్రీశైలంలో కేంద్ర బలగాలు

శ్రీశైలం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 16న శ్రీశైలం రానున్న సందర్భంగా సోమవారం పోలీసులు కవాతు నిర్వహించాయి. భద్రతా పరమైన అంశాల్లో భాగంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రధాని భద్రత, దర్శనం ఏర్పాట్లు సంబంధించి ఏపీ డీజీపీ, డీఐజీలు, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది.


క్షేత్రంలో గ్రేహౌండ్స్ బలగాలు

శ్రీశైలం పవిత్రతను కాపాడండి

5వ పేజీ తరువాయి

దేవస్థానం తరుపున చెంచులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, సామాన్య భక్తులకు కూడా స్పర్శదర్శనం కలిగేలా కృషి చేస్తామన్నారు. తనను చైర్మన్‌గా ఎన్నిక చేసిన సీఎం నారా చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 16వ తేదీన నరేంద్ర మోదీ శ్రీశైలంకు వస్తున్నారని, ఆయనకు ఘన స్వాగతం చెప్పి ఆలయాభివృద్ధి కోసం ధర్మకర్తల మండలి సభ్యుల తరపున వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు.


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ధర్మకర్త మండలి

స్వామి, అమ్మవార్లకు పూజలు

శ్రీశైల దేవస్థానంలో ముందుగా అర్చకులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేయగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా రమేష్‌నాయుడు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులు రమణ, బి.రమణమ్మ, జి.లక్ష్మీశ్వరి, కె.కాంతివర్ధిని, ఎస్.పిచ్చయ్య, దేవకీ వెంకటేశ్వర్లు, జె.రేఖాగౌడ్, ఎ.అనిల్‌కుమార్, డి.వెంకటేశ్వర్లు, బి.వెంకటసుబ్బారావు, సి.హెచ్.కాశీనాథ్, ఎం.మురళీధర్, యు.సుబ్బలక్ష్మీ, పి.యు.శివమ్మ, జి.శ్రీదేవితో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించబడిన పలువురు సభ్యులు కూడా ఈకార్యక్రమానికి హాజరయ్యారు. సభ్యులందరికీ వేద ఆశీర్వచనాలతో పాటు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాన్ని ఈవో శ్రీనివాసరావు అందజేశారు. సభ్యులుగా ఎన్నికైన చిట్టిబోట్ల భరద్వాజ శర్మ, గుల్ల గంగమ్మ ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ప్రమాణ స్వీకారానికి పిలువకపోవడంతో తమకు బాధ వేసిందని గుల్ల గంగమ్మ పేర్కొన్నారు.

అనుబంధాలు విస్మరించి.. అమ్మను మరిచి..!






అమ్మ సృష్టిలో అమూల్యమైన బంధం.. అమ్మ తన బిడ్డలను కనిపెంచేందుకు ఎన్నో పాట్లు పడుతోంది. బిడ్డ బాధపడితే చూడలేదు.. బిడ్డకు కష్టమైతే ఎంతటి త్యాగానికి సిద్ధమవుతోంది. అవసరమైతే ప్రాణాలను సైతం పణంగా పెట్టగలిగేదే మాతృమూర్తి.. అలాంటి అమ్మ నేడు నిరాదరణకు గురై.. బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తుండటం హృదయ విదారకం. మనుషులైనా మనం నేడు మానవత్వాన్ని మరిచిపోతున్నాం. బంధాలను విస్మరించి.. ఎవరి దారి వారిదే అన్న చందంగా బతుకులు సాగిస్తున్నాం.. కనిపెంచి పెద్ద చేసిన తల్లినే అనాథగా వదిలేస్తున్నారు కొందరు కొడుకులు. మా బతుకులు మావే.. నీ దారి నీదే అన్న రీతిలో వ్యవహరిస్తూ ఆ తల్లిని కష్టాల కడలిలో నెట్టి వేశారు. బస్ షెల్టరే ఆమె నివాసమైంది. ఊతకర్రే నడిపిస్తోంది. ఓ ప్లాస్టిక్ బాటిల్, బొంత, దుప్పటి ఆమె ఆస్తి. కన్న బిడ్డలు పెట్టిన క్షోభ ముందు దోమలు, చలి, వర్షం ఇవేమీ బాధించడం లేదు. ఆమె చేస్తున్న జీవనం పోరాటం చూస్తే ప్రతి ఒక్కరికీ కన్నీళ్లు రావాల్సిందే.. 82 ఏళ్ల మాదరమ్మ దీనగాథ ఇది. కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన దూదేకుల పెద్దయ్య, మాదారమ్మ దంపతులు. వీరికి ముగ్గురు కొడుకులు. వ్యవసాయం చేస్తూ వారిని పోషించారు. వారందరికీ పెళ్లిళ్లు చేశారు. పెద్దకొడుకు హసన్ కోడుమూరులో, మూడో వాడు సిద్ధయ్య గోకులపాడులో స్థిరపడ్డారు. రెండో కుమారుడు దస్తగిరి స్వగ్రామమైన పులకుర్తిలోనే ఉంటున్నాడు. పెద్దయ్య, మాదారమ్మ దంపతులు తమకున్న ఆస్తి, నగదు కొడుకులకు పంచి ఇచ్చారు. సత్తువ ఉన్నంత వరకు కొడుకుల కోసం పొలం పనులు చేశారు. పెద్దయ్యకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఐదేళ్ల క్రితం పెద్దయ్య మృతి చెందాడు. భర్త మరణంతో మాదారమ్మకు కష్టాలు ఆరంభమయ్యాయి. చీదరింపులు, చీత్కారాలను అనుభవిస్తూ గడిపింది. కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాండ్రు అందరూ ఉన్నా ఒంటరి జీవితం అనుభవిస్తోంది. ఆమెకు వితంతు పింఛన్ వస్తుంది. ఆ డబ్బులు కూడా చేతికందేలోగా మాయమవుతున్నాయి. కొడుకు చేతిలోకి వెళ్లిపోతున్నాయి. ఒక్కోసారి రాత్రిపూట బస్టాండ్‌లో నిద్రించే సమయంలో తాగుబోతులు కొట్టేస్తున్నారు. దీంతో అర్ధాకలితో గడుపుతోంది. ఎవరైనా దయ తలిస్తే ఆమె ఆకలి తీరుతుంది. మానసికస్థైర్యం కోల్పోయి తనలో తానే మాట్లాడుకుంటోంది. మనుషులారా.. ఇప్పటికైనా మాతృమూర్తి విలువను తెలుసుకొని.. అను'బంధాల'తో ముందుకు వెళ్తూ.. చివరి మజిలీలో ఉన్న అమ్మను అక్కున చేర్చుకొని.. ప్రేమానురాగాలను పంచుదాం.

- కోడుమూరు రూరల్, ఆంధ్రజ్యోతి



అన్నీ తానై..!



- చక్రం తిప్పుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగి
- ఇష్టానుసారంగా కళాశాలలకు అనుమతులు
- అధికారులపై ఒత్తిడి
- గుడ్డిగా అనుమతులిచ్చారని విద్యార్థి సంఘాల ఆరోపణలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 బీఈడీ కళాశాలలకు సొంత బిల్డింగ్‌లు లేకపోయినా అనుమతులి ప్పించడంలో ఆర్‌యూలో పనిచేసే ఓ కాంట్రాక్టు ఉద్యోగి అన్నీ తానై వ్యవహరించాడు. నన్నూరు వద్ద ఉండాల్సిన శారద బీఈడీ కళాశా లను అబ్దుల్లా కాలేజీలో, జోన్ లోని గాయత్రి కాలేజీలో క్రిష్ణవేణి స్కూల్ ఉంది. అక్కడ ఉండాల్సిన కాలేజీని శ్రీవైష్ణవి డిగ్రీ కళాశా లలో ఉన్నట్లు చూపించారు. నందికొట్కూరులో శివసాయి కళాశాల లేకపోయినా అనుమతులు, నాయక్ బీఈడీ కళాశాల దూపాడులో ఉండాల్సి ఉండగా ఎక్కడ అనుమతులిచ్చారనేది ప్రశ్నార్థకం. సీడీసీ విభాగం నుంచి వెళ్లిన కమిటీ సభ్యులు గుడ్డిగా అను మతులు మంజూరు చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తు న్నాయి. నవభారత్ బీఈడీ కళాశాలలో నాలుగు విద్యాసం స్థలు నడుస్తుండటం కోస మెరుపు.

తలలు పట్టుకుంటున్న అధికారులు

ఒకే భవనంలో రెండు బీఈడీ కళాశాలలకు అనుమతులపై రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈనెల 11న 'ఒకే భవనంలో మూడు కళాశాలలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. బీఈడీ కళాశాలలకు సంబంధించి 2025 విద్యా సంవత్సరానికి అఫిలియే షన్ పూర్తి చేసుకుని ఏఎఫ్ఆర్‌సీ(అడ్మిషన్ అండ్ ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ)కి పంపినట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. తమకు అనుమ తులు కొనసాగించాల్సిందేనని యాజమాన్యాలు పట్టు పడుతున్నట్లు సమాచారం. ఒకే భవనంలో రెండు బీఈడీ కళాశాలలకు అనుమతు లకు ఆర్‌యూలోని ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి సహకరించాడు. ఈ క్రమం లో పంచలింగాలలో కొనసాగాల్సిన కళాశాలలకు అదే భవనంలో అనుమతులు కొనసాగించాలని సీఎంవో కార్యా లయం నుంచి సదరు కాంట్రాక్టు ఉద్యోగి వర్సిటీ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా ఒత్తిడి పెంచినట్లు సమాచారం.

అనుమతులివ్వడం లేదంటూ..

ఇదే విషయంపై యూనివర్సిటీ ఉపకులపతి వి. వెంకట బసవరావు వద్ద ప్రస్తావించగా సీఎంవో కార్యాలయం నుంచి ఎటువంటి ఒత్తిడి లేదు. పైగా ఆ కళాశాలకు తాము అనుమతులివ్వడం లేదంటూ దాట వేశారు. బీఈడీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలకు అనుమతులపై నగరంలోని ఓ కళాశాలలో అత్యవసరంగా సమావేశ మయ్యారు. ప్రతి ఏటా జరుగుతున్న ప్రక్రియ సవ్యంగా సాగేందుకు ఉన్నతాధికారులతో చర్చలు జరిపాలని, అవసరమైతే ఉన్నత విద్యా మండలిలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుందామని చర్చించి నట్లు సమాచారం.

కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ నిరసన



ఎక్సైజ్ డీసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంతో కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని నగర మేయర్ బీవై రామయ్య ఆరోపించారు. నగరంలోని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మద్యం బాటిళ్లతో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో నిరసన చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందిం చారు. వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎక్కడో సరిహద్దులోని ములకల చెరువులో బయట పడ్డ టీడీపీ నాయకుల కల్తీ ఫ్యాక్టరీ లింకులు, తర్వాత విజయవాడలో బయట పడ్డయని అన్నారు. జరిగిన ఘటనలు అన్నింటినీ పరిశీలిస్తే ఈ మాఫియా ఎంత విస్తారంగా ఉందో తెలుస్తోందన్నారు. ఇలాంటి వ్యవహాల్లో ఆరితేరిన టీడీపీ వర్గీయులు పకడ్బందీగా దీన్ని నడుపు తున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు, మండలాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కలచట్లలో చోరీ

ప్యాపిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచట్ల గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు రాజేశ్ కుటుంబం ఇంటికి తాళాలు వేసి పొలానికి వెళ్లారు. దీనిని గమనించిన దుండగులు తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బీరు వాను పగలగొట్టి అందులోని 4తులాల బంగారం ఎత్తికెళ్లినట్లు ఎస్‌ఐ మధు సూదన్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వీవోఏ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం అరుణమ్మ నగర్‌లో ఈ.సుంకన్న అధ్యక్షతన వీవోఏ ఉద్యోగ సం ఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా బి.రంగన్న, ఉపాధ్యక్షులుగా కుమార్, మారెప్ప, సూర్యచంద్ర, సృజన, ప్రధాన కార్యదర్శి బి.మద్దిలేటి, కార్యదర్శులుగా ఈ.సుంకన్న, రామ కృష్ణ, హరిత, కల్యాణితో పాటు 23 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఆళ్లగడ్డ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో జయచంద్రారెడ్డి(50) మృతి చెందాడు. కడప జిల్లా రాజుపాలెం మండలం గాజగూడూరుకు చెందిన జయచంద్రారెడ్డి ఆళ్లగడ్డలో పనులు ముగించుకుని స్వగ్రామమైన గాజగూడురుకు బైక్‌పై బయలు దేరాడు. ఆళ్ల గడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి జాతీయ రహదారి డివైడర్‌కు ఢీకొంది. జయచంద్రారెడ్డి తలకు బల మైన గాయం కావడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లారీని ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొలిమిగుండ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కారు టైరు పగలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న ఘటన మండ లంలోని బందార్లపల్లె చెక్ పోస్టు సమీపంలో చోటు చేసు కుంది. ప్యాపిలి మండలం పొదొడ్డి గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి కారులో తాడిపత్రి వైపు వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. ఈఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, క్రిష్ణమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి.

స్విమ్మింగ్ పోటీలో వైద్యురాలి ప్రతిభ

- కేఎంసీ అనస్థీషియా డాక్టర్‌కు ఐదు గోల్డ్ మెడల్స్



జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్‌ను అందుకుంటున్న అనస్థీషియా డాక్టర్ చందన రాజారాం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాస్టర్స్ స్విమ్మింగ్ అసో సియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో జరిగిన 7వ మాస్టర్ నేషనల్ స్విమ్మింగ్ చాంపియన్ పోటీలో వైద్యులు ప్రతిభ కనబరిచారు. కేఎంసీ(క ర్నూలు మెడికల్ కాలే జీ)కి అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందన రాజారాం పతకాల పంట పండించారు. జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో నాలుగు బంగారు పత కాలు, రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఒక గోల్డ్‌మెడల్, రజిత, కాంస్య పత కాలను సాధించి రికార్డు నెలకొల్పారు. జాతీయ, రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో ఒకేసారి ఐదు గోల్డ్ మెడల్స్‌ను సాధించిన చందన రాజారాంను ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ అభినందించారు. స్విమ్మింగ్‌లో బంగారు పతకాలు సాధించిన డాక్టర్ చందనరాజారాం మాట్లాడుతూ పదేళ్లుగా స్విమ్మింగ్ ప్రాక్టీసు చేస్తున్నానని, తొలిసారిగా ఈసారి మంగళగిరి, గుంటూరులో జరి గిన జాతీయ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ పతకాలను సాధించడం సంతో షంగా ఉందన్నారు.

డిప్యూటీ డెమోలకు హెచ్‌ఈఈవోలుగా పదోన్నతి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న డిప్యూటీ డెమోలకు ఆరోగ్య విద్య, విస్తరణ అధికారులు (హెచ్‌ఈఈవో)లుగా పదోన్నతులు కల్పిస్తూ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీర పాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసులో డిప్యూటీ డెమోగా పని చేస్తున్న సీఎం చంద్రశేఖర్ రెడ్డి హెచ్‌ఈఈవోగా పదోన్నతిపై కర్నూలు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్)కు బదిలీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా డిప్యూటీ డెమోగా ఉన్న ఎన్.బాబా ఫక్రుద్దీన్‌ను కర్నూలు పీవోడీటీటీ ట్రైనింగ్ సెంటర్ హెచ్‌ఈఈవోగా పదోన్నతి కల్పించారు. నంద్యాల డీఎంహెచ్‌వో ఆఫీసులో డిప్యూటీ డెమోగా ఉన్న కె.రవీంద్ర నాయక్‌ను కర్నూలు రీజినల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్) హెచ్‌ఈఈవోగా, అన్నమయ్య డీఎంహెచ్‌వో ఆఫీసు డిప్యూటీ డెమోగా ఉన్న పి.దేవా శిరోమణిని కర్నూలు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)కు పదోన్నతి కల్పించి బదిలీ చేశారు.

గోనెగండ్లలో వైసీపీకి షాక్

- టీడీపీలోకి రమణికుమారి, మురళీనాయుడు



రాజీనామా సమర్పిస్తున్న రమణికుమారి

గోనెగండ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో వైసీ పీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన గోనెగండ్ల 2 ఎంపీ టీసీ రమణికుమారి తన పదవికి రాజీనామా చేశారు. సోమ వారం ఉదయం తన అనుచరులతో కలసి రమణికుమారి ఎంపీ డీవో కార్యాలయానికి చేరుకొని తన రాజీనామా పత్రంను ఎంపీ డీవో మణిమంజరికి అందజేశారు. తాలుకా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు తన పదవికి రాజీనామ చేశారు. తన రాజీ నామా పత్రంను జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి పంపారు. గోనెగండ్లలో బలమైనా సామాజిక వర్గా నికి చెందిన మురళీనాయుడు, ఆయన భార్య రమణికుమారి వైసీపీ కి రాజీనామా చేయడం తో ఆ పార్టీ గట్టి షాక్ తగిలినట్ట యింది. మురళీనాయుడు కుటుంబం రాజకీయ నేపథ్యం కలిగి నది. ఆకుటుంబం నుంచి మురళీనాయుడి తండ్రి వాసుదేవనా యుడు, తల్లి లక్ష్మీదేవమ్మ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు గా గతంలో ఎన్నికయ్యారు. మురళీనాయుడు పార్టీకి రాజీనామా చేయడంతో గోనెగండ్లలో వైసీపీకి వచ్చే స్థానిక ఎన్నికలలో గట్టి దెబ్బ తగనున్నట్లు టీడీపీ నాయకులు భావిస్తున్నారు. తమ పద వులకు రాజీనామా చేసిన మురళీనాయుడు, రమణికుమారి తన అనుచరులతో కలసి ఎమ్మిగనూరుకు ప్రత్యేక వాహనాల్లో బయలు దేరారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో సైకిల్ ఎక్కారు. ఇదే బాటలో మరి కొందరు వైసీపీ నాయకులు వచ్చే స్థానిక ఎన్నికల లోపు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.

21 నుంచి పత్తి కొనుగోలు

- దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు
- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి మోసపోవద్దని, ఈ నెల 21 నుంచి పత్తి కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. సోమవారం నగరంలోని మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జేడీ మాట్లాడుతూ గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం క్వింటం పత్తికి రూ.7,521 మద్దతు ధరను ప్రకటిస్తే.. ఈసారి క్వింటానికి రూ.8,110 ప్రకటించిందని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 దాకా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో రైతులను ప్రలోభాలకు గురి చేసి వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు, తక్కువ తూకంతో కొన్నా, మార్కెట్ కమిటీల పరిధిలో అధికారులు, సిబ్బంది అనుమతి లేకుండా రైతుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి తీసుకువచ్చే సమయానికి ముందే గ్రామా ల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పంట వివరాలను నమోదు చేయించాలని సూచించారు. వ్యాపారులు, దళారులు సెస్సు ఆదా యానికి గండి కొట్టి అక్రమ మార్గాల్లో పంట ఉత్పత్తులను బయటి ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, జిల్లా ఏడీఎం నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



కర్నూలు మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నష్టపో యిన ఉల్లి రైతులను కూటమి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతుల ఆధ్వ ర్యంలో సోమవారం కొత్తబస్టాండు సమీపంలోని కార్మిక, కర్షక భవన్‌లో ఉల్లి రైతుల సదస్సు, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభాకర్ రెడ్డితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన సహాయ కార్యదర్శి కృష్ణ ఈ సద స్సుకు అధ్యక్షత వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మసిపూసి మారేడు కాయ చేసినట్లుగా ఉల్లి రైతులకు కంటి తుడుపుగానే ప్రయోజనం అందివ్వడం దారుణమన్నారు. క్వింటానికి రూ.2,500 చెల్లించాల్సిందిపోయి మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం రూ.1,200లు మాత్రమే తూతూ మంత్రంగా అందించా రని అన్నారు. అది కూడా కొద్ది రోజులే అమలు చేసి ఒక్కో రైతుకు హెక్టారుకు రూ.50వేలు మాత్రమే అందించడం దారుణ మని అన్నారు. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50వేల ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారని, ఒక ఎకరాకు రూ.లక్ష దాకా ఉల్లి పంటకు పెట్టుబడి పెట్టి వ్యాపా రుల మాయాజాలంతో క్వింటానికి రూ.300 నుంచి రూ.500 మాత్రమే రావడంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో వారు కర్నూలు మార్కెట్ కమిటి కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించారు. తక్షణమే రైతులను ఆదుకో కుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం రైతు సంఘం కార్య దర్శి మధుసూదన్, ఆదోని నుంచి అయ్యప్ప పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

కర్నూలు క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాగప్ప వీధిలో నివాసం ఉంటున్న చెన్నకేశవులు(44) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మకూరుకు చెందిన కుటుంబంతో కలిసి నాలుగేళ్ల క్రితం కర్నూలుకు వచ్చాడు. ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఫ్లోర్ మేనేజర్‌గా పని చేస్తు న్నాడు. కొద్ది కాలంగా ఆయనకు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ప్రైవేటు ఆసుపత్రిలో పని చేసే భార్య నాగమణి సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రేన్ తగిలి వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి చౌరస్తా చెన్నమ్మ సర్కిల్ సమీపంలో క్రేన్ తగిలి చిన్న కుమార్ (40) మృతిచెందాడు. ఈ-తాండ్రపాడుకు చెందిన ఆయన కూలి పనుల నిమిత్తం సోమవారం ఉదయం కర్నూ లుకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు క్రేన్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో వీఐపీ సేఫ్ రూముల ఏర్పాటు



గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో సిద్ధం చేసిన వీఐపీ సేఫ్ రూమ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తున్న నేప థ్యంలో అక్కడికి వస్తున్న వీఐపీల కోసం కర్నూలు జీజీ హెచ్‌లో ప్రత్యేక సేఫ్ రూమ్‌లను సిద్ధం చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలోని మొదటి అంతస్తులో ఉన్న ఐసీయూ గదిలో పది పడకలతో వీఐపీ సేఫ్ రూమ్‌ను సిద్ధం చేశారు. ప్రధానమంత్రి పర్యటనలో ఎవరైనా వీఐపీలు అస్వస్థతకు గురైతే వైద్యసేవల కోసం సేఫ్ రూమ్‌ను సిద్ధం చేసి నట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటే శ్వర్లు తెలిపారు. దీంతో పాటు కార్డియోథొరాసిక్ విభాగంలోని పది పడకలతో మరో వార్డును కూడా సిద్ధం చేశారు. అలాగే న్యూ క్యాజువాల్టీలో ప్రత్యేకంగా 15 పడకలతో కూడా బఫర్ స్టాక్ రూమ్‌ను సిద్ధం చేస్తున్నారు.

గూడు కల్పించిన అధికారులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పద్మమ్మకు ఆశ్రయం కల్పించేందుకు తీసుకెళ్తున్న అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చెట్టుకింద జీవనం సాగిస్తున్న పద్మమ్మను తమ్ముడు దేవన్న, భార్య గంగమ్మ, కూతురు విజయ లక్ష్మి, మరదలు గౌరమ్మ, బావ అడివప్పకు అప్పచెప్పి అధికా రులు గూడు(ఆశ్రయం) కల్పిం చారు. సోమవారం 'ఆంధ్రజ్యో తి'లో 'గూడు చెదిరి.. తరువు కింద చేరి..!' అన్న శీర్షిక ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఇందుకు డీటీ జీకే గురురాజ రావు, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణయ్య, ఆర్‌ఐ జనార్దన్ రావు స్పందించి తన తమ్ముడైన దేవన్న ఇంట్లో ప్రత్యేకగదిలో ఆశ్రయం కల్పించారు. పదిహేనేళ్లుగా చెట్టుకింద జీవనం సాగిస్తున్న వస్తువులు, వంట సామగ్రి ఆటో సహాయంతో అక్కడి నుంచి మార్చి గూడు కల్పిం చారు. గతంలో రాఘవేంద్రపురంలో టీడీపీ ప్రభుత్వం 1998 ఇచ్చిన ఇంటి స్థలంలో ప్రభుత్వం ద్వారా ఇంటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తామని అధికారులు తెలిపారు. ఇల్లు నిర్మాణం అయ్యేంత వరకు తాత్కా లికంగా తమ్ముడి ఇంటి దగ్గరే ఉండాలని సూచించారు. స్థానిక సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కవిత ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సైతం పూర్తిచేశారు. గూడు చెదిరిన మహిళకు ప్రభుత్వం అండగా ఉంటుం దని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌వో భీమన్నగౌడు, రాఘవేంద్ర, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో కర్నూలు

- ప్రధాని భద్రతకు నగరానికి చేరిన పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని భద్రతా ఏర్పాట్లు చేపట్టేందుకు పలు జిల్లాల నుంచి సుమారు 7,500 మంది పోలీ సులు సోమవారం కర్నూలు చేరుకున్నారు. కర్నూలు, ఓర్వకల్లు, నన్నూరు తదితర ప్రాంతాలన్నీ ఖాకీల మయమయ్యాయి. పలు ప్రధాన కూడళ్లలో సోమవారం సాయంత్రం నుంచే పోలీసులు తనిఖీలు చేశారు. కర్నూలు చేరిన పోలీసు బలగాలకు ఏఎస్‌ఐ, కింది స్థాయి ఉద్యోగులకు 31 ఫంక్షన్ హాళ్లలో బస ఏర్పాటు చేశారు. డీఎస్పీ, సీఐ ఆ స్థాయి అధికారులకు పలు హోటళ్లలో రూములు కేటాయించారు. ప్రధాని పర్యటించే ఓర్వకల్లు ఎయిర్ పోర్టు, రాగమయూరి హెలిప్యాడ్ ప్రాంతాలను అదనపు డీజీ సోమవారం పరిశీలించారు.

సారూ.. వెళ్లవద్దు..!



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు వీరేష్‌ను పట్టుకొని ఏడుస్తున్న విద్యార్థులు

ఆ ఉపాధ్యాయుడు అంటే విద్యార్థు లకు ఎనలేని అభిమానం.. అతడు పాఠాలు చెబితే వారంతా శ్రద్ధగా వింటారు. విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు. వారి ఎదు గుదలకు అహర్నిశలు శ్రమించారు. విద్యార్థులను సొంత బిడ్డలా చూసుకున్నారు. ఆ ఉపాధ్యాయుడికి బదిలీ అయింది. కానీ ఈ విషయం చాలా గోప్యంగా ఉంచారు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో వేరే చోటుకు వెళ్లాల్సింది. విషయం విద్యార్థులకు తెలిసిందే. అంతే ఇక ఒకటే ఏడుపులు.. 'సారూ.. మమ్మల్ని వది లిపోవద్దు సారూ.. నీకోసం ప్రాణాలైనా ఇస్తాం.. నువ్వు ఇక్కడే ఉండాలి సారూ..' అని ఆయనను చుట్టుముట్టి కన్నీటి పర్యం తమయ్యారు. పెద్దకడబూరు మండలంలోని ముచ్చుగిరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బెస్త వీరేష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గంగులపాడు బదిలీ అయ్యారు. సోమవారం ఆయన రిలీవ్ కావాల్సి ఉండటంతో విషయం విద్యార్థులకు తెలిసింది. వారు కన్నీటి పర్యంతమ య్యారు. విద్యార్థులు చూపిన ప్రేమానురాగాలకు ఉపాధ్యా యుడి కళ్లు సైతం చెమగిల్లాయి. నేను ఎక్కడికి వెళ్లనని రోజు మన పాఠశాలకే వస్తానని విద్యార్థులకు నచ్చజెప్పి కాసేపు వారిని ఓదార్చి రోజు మాదిరిగా పిల్లలతో గడిపి బరువెక్కిన మనసుతో వెళ్లిపోయారు. పాఠశాలలో చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థి హరికృష్ణ అయితే 'సారూ.. నీ కోసం ప్రాణాలు అయినా ఇస్తానంటూ లేఖ రాశాడు. ఆ ఉపాధ్యాయుడు పిల్ల లపై చూపిన ప్రేమానురాగాలు చూసి ప్రతిఒక్కరూ అభినంది స్తున్నారు.

- పెద్దకడబూరు, ఆంధ్రజ్యోతి

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించండి



ర్యాలీలో పాల్గొన్న జడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0 పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు మండల పరిసత్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డితో కలిసి ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పుష్పావతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కుమార్ సాయినాథ్, మురళి మోహన్‌రెడ్డి, ఏఓ నాగరాజు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో రాష్ట్రానికి ఏమి ప్రయోజనం


కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని ప్రధాని పర్యటనలు రాష్ట్రానికి ఏమి ప్రయోజనమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం ప్రశ్నించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నరేంద్ర మోడీ గో బ్యాక్ కరపత్రాన్ని విడుదల చేశారు. జగన్నాథం మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సుంకుల తగ్గింపు ఘనకార్యం గురించి మాట్లాడేందుకు కర్నూలుకు వస్తున్నారని విమర్శించారు. 16 నెలల కాలంలో రాష్ట్రానికి నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చిన ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని అన్నారు. మోదీ పర్యటనను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి, నగర సహయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పాల్గొన్నారు.

ట్రంపు సుంకాలను మోదీ ప్రభుత్వం దీటుగా ఎదుర్కొవాలి

● సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధిస్తున్న సుంకాలను మోదీ ప్రభుత్వం దీటుగా ఎదుర్కొవాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల అన్నారు. సోమవారం కేకే భవన్‌లో ట్రంప్ విధించిన సుంకాలు-భారత్ పై ప్రభావం అనే అంశంపై జిల్లా కమిటీ సభ్యుడు నగేష్ అధ్యక్షతన చర్చావేదిక ఏర్పాటు చేశారు. నిర్మల మాట్లాడుతూ ట్రంపు ఇంత దుర్మార్గంగా వ్యవహిస్తున్న దానిని ప్రశ్నించకుండా నిమ్మకు నీరెత్తినట్లు మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అలాంటి మోదీని కర్నూలుకు పిలిచి వందల కోట్లు ఖర్చు పెట్టి పొగడ్తలతో ముంచెత్తడానికి ప్రయత్నం చేస్తున్న రాష్ట ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్, వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి వైఖరి అస్యాస్పదంగా ఉందని అన్నారు. చర్చావేదికలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు టి.రాముడు, ఎం.రాజశేఖర్, విజయరామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న మోదీ

జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి నాగమధు యాదవ్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 8 ఏళ్లుగా జీఎస్టీ పేరుతో దోచేసిన రూ. లక్షల కోట్లు ఏమి చేశారని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి నాగమధు యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మోదీ జీఎస్టీ ఏదో తగ్గించానని దేశ ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు, డ్రోన్ హబ్‌లంటూ నాయకుల జేబులు నింపేందుకు ప్రదాని మోదీ జిల్లా పర్యటనకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు ప్రధాన కార్యదర్శి శ్రీనిధిరాయల్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు యాదవ్, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు కోర్టు విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలంటూ బార్ అసోసియేషన్ 14, 15, 16 తేదీల్లో మూడు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరించడానికి తీర్మానించినట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ శ్రీభాగ్ ఒప్పందం మేరకు కోస్తాలో రాజధాని ఉంటే, కర్నూలులో హైకోర్టు ఉండాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒడంబడికను ఖాతరు చేయకుండా కాలయాపన చేస్తుందని వారు విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 16న కర్నూలు వస్తున్న నేపథ్యంలో హైకోర్టుకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే రాయలసీమకు న్యాయం చేసినట్లవుతుందని వారు అన్నారు. న్యాయవాదులందరూ ఈ మూడు రోజుల పాటు సహకరించి, విధులను బహిష్కరించాలని కోరారు.

వైద్యుల సమ్మెకు సంఘీభావం



హుశేనాపురం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జిలతో సంఘీభావం తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఓర్వకల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పీహెచ్‌సీ వైద్యులు నిర్వహిస్తున్న సమ్మెకు సంఘీభావంగా నల్లబ్యాడ్జిలు ధరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సూపర్‌వైజర్లు, నర్సులు, ఆశావర్కర్లు నల్లబ్యాడ్జిలు ధరించి ఆసుపత్రి ఎదురుగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

అంతా మా ఇష్టం..!

కోడుమూరు వైపు తొంగి చూడని జేఈఈలు
ఇరిగేషన్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం
ఇబ్బందులు పడుతున్న రైతులు


ఎప్పుడు చూసినా ఖాళీ కుర్చీలే దర్శనం

కోడుమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోడుమూరు టీబీపీ, జీడీపీ సబ్‌డివిజన్‌లోని కొంత మంది జేఈ విధుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం జేఈలు విధులకు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనం ఇచ్చాయి. నెలలో ఒక్క రోజు కూడా కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. నెలకు రూ. లక్షల్లో జీతాలు తీసుకొంటున్నారు. అయితే ఒక్క రోజు కూడా రైతులకు అందుబాటులో లేకపోతే మా కష్టాలు ఎవరికి చెప్పుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ అధిక వర్షాల కారణంగా పంటలు నాశనమయాయి. రాబోయే రోజుల్లో వేసిన పంటలకు నీళ్లు ఇస్తారా? లేదా? అని చెప్పిందుకు సంబంధిత జేఈలు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరారు.

జేఈల విధులు ఎక్కడ

టీబీపీ కర్నూలు సెక్షన్‌లో దుర్గాభవాని జేఈగా విధులు నిర్వహిస్తోంది. కోడుమూరు సెక్షన్ ఇన్‌చార్జి జేఈగా ఉన్నతాధికారులు దుర్గాభవానికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఆమె నెలలో ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే కోడుమూరులోని తన కార్యాలయానికి వచ్చి వెళ్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇక గాజుల దిన్నె ప్రాజెక్టు కోడుమూరు సెక్షన్‌లోని కుడి కాల్వ జేఈగా శంకర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు జీఆర్‌పీలో అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఇదే ఆసరాగా తీసుకొన్న ఈయన నెలలో ఒక్క రోజు కూడా తన కార్యాలయానికి వచ్చిన దాఖలాలు లేవు. జీడీపీ ఎడమ కాల్వ జేఈ మహ్మద్ అలీ ఈయన రెగ్యులర్ జేఈగా కొనసాగుతున్నారు. దీంతో పాటు జీడీపీ డ్యాం ఇన్‌చార్జి బాధ్యతలను కూడా చేపడుతున్నారు. డ్యాం పేరు చెప్పి కోడుమూరు సెక్షన్‌కు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ఎవరికి వాళ్లు ఇన్‌చార్జి బాధ్యతలు అంటూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ సొంత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిస్తోంది.


టీబీపీ సబ్‌డివిజన్ సెక్షన్ ఆఫీసులు

తప్పకుండా ఆఫీసులకు రావాలి



అదనపు బాధ్యతలు ఉన్నప్పటికీ సంబంధిత కార్యాలయాలకు జేఈలు తప్పకుండా రైతులకు అందుబాటులో ఉండాలి. ఇక నుంచి రైతులకు అందుబాటులో ఉంటే విధంగా జేఈలకు ఆదేశిస్తాం.

● సుబ్బారాయుడు, డీఈ, సబ్‌డివిజన్, కోడుమూరు

మోదీ సభకు కదలిరండి

● కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వెల్లడి


మాట్లాడుతున్న కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు రూరల్ అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం సమీపంలో 16న జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు ఉప్పెనలా కదలిరండి అని కేడీసీసీబీ ఛైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కోడుమూరు నియోజకవర్గం నుంచి 50వేల మంది తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. పీఎం, సీఎం సభ కోసం జనసమీకరణపై కర్నూలు మండలం ఈ.తాండ్రపాడులో సోమవారం పంచలింగాల, దేవమాడ, గొందిపర్ల గ్రామ ప్రజలతో విష్ణు, దస్తగిరి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గల దస్తగిరి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హమీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. జీఎస్టీ వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మోదీ సభకు ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కర్నూలు అర్బన్: ప్రధాని మోదీ జీఎస్టీ సభను వాల్మీకులు భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎల్లమ్మ దేవాలయం మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకులు బేతం కృష్ణుడు పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సభకు ప్రతి గ్రామం నుంచి ఒక బస్సులో వాల్మీకులు 3 లక్షల మంది రావాలని కోరారు. సమావేశంలో వాల్మీకి సీనియర్ నాయకులు భూపన చంద్రయ్య, బోయ ధర్మ ఉద్యమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల రామానాయుడు, పి. విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

గూడూరు: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన ఏర్పాట్లను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు పరిశీలించారు. సోమవారం కర్నూలులో ప్రధానమంత్రి మోదీ సభ ఏర్పాట్లను జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, గ్రామ వికాస సమితి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రముఖ్ డమాం సురేష్‌తో కలిసి పరిశీలించారు.

కోడుమూరు: నన్నూరు టోల్ ప్లాజా సమీపంలో నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని ఎంపీడీవో రాముడు పిలుపు నిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు రామకృష్ణారెడ్డి, మహేష్‌నాయుడు, బలరాం, గంగాధర్, మాలమహానాడు మునిస్వామి పాల్గొన్నారు.

గూడూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణమోహన్ శర్మ అన్నారు. సోమవారం గూడూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ మధులత, ఆయా శాఖల అధికారులు, మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు గుడిపాడు మహేశ్వర రెడ్డి, గోపాల్ రెడ్డి, మునగాల గోపాల్, రామచంద్రుడు, బంగారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సి. బెళగల్: ప్రదానమంత్రి నరేంద్రమోదీ సభను జయప్రదం చేద్దామని టీడీపీ మండలకన్వీనర్ చంద్రశేఖర్ మండల టీడీపీ నాయకులతో మావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని టీడీపీ నాయకులు అందరు తమ బాధ్యతతో గ్రామంలో ఉన్న నాయకులు అందరు కలిసి కట్టుగా పనిచేసి మోది సభను జయప్రదం చేద్దాంమని కోరారు. ఈ సమావెశంలో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మప్ప,బాలజీ, వెంకటేశ్, అనుమంతుగౌడు, విద్యాకమిటీ ఛైర్మన్లు వెంకటేశ్వర్లు, గోవిందు పాల్గొన్నారు.

● ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు.సోమవారం మండల పరిషత్‌కార్యాలయం సమావెశం భవనంలో మండలంలోని 18 గ్రామ పంచాయతీల సచివాలయ సిబ్బంది, మండలంలోని టీడీపీ నాయకులతో సమావెశం నిర్వహించారు.

కాల్వబుగ్గను నందనవనంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే

● ఘనంగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం


కాల్వబుగ్గ రామేశ్వరస్వామి నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న గౌరు దంపతులు

ఓర్వకల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కాల్వబుగ్గ పుణ్యక్షేత్రాన్ని నందనవనంగా తీర్చిదిద్ది భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యేతో పాటు నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు వారికి ఆలయ ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ మేళతాళాలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శివుడికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రమాణ స్వీకార సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అధ్యక్షత వహించారు. అనంతరం కాల్వబుగ్గ ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా కాటినేని నారాయణ, ధర్మకర్తలుగా కాకి రామచంద్రుడు అలియాస్ కాకి దేవేంద్ర, ఎం.వరలక్ష్మి, ఎల్.వరలక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, ఎం.పెద్దమల్లయ్య, లక్ష్మీనారాయణ, జి.ఆంజనేయశర్మ, ఎం.పుల్లమ్మ, ఎం.లక్ష్మీబాయి, కల్లె లక్ష్మీనారాయణశర్మలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమణ, ఈవో మద్దిలేటి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, నాగిరెడ్డి, పార్వతమ్మ, సుధాకర్ రెడ్డి, సుధాకర్‌రావు, నాగేశ్వరరెడ్డి, నాగముని, శ్రీనివాసులు, జీకే సుధాకర్, సత్యనారాయణ, హరికృష్ణ, నాగేశ్వర యాదవ్, మండలంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో రోగుల ప్రాణాలను కాపాడవచ్చు

● కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ


సీపీఆర్‌పై మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అనస్తీషియా వైద్యులు

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హృదయ- శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్)తో రోగుల ప్రాణాలను కాపాడవచ్చనని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ అన్నారు. నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీపీఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాలను కోరారు. అత్యవసర పరిస్థితి ఎవరికైనా రావచ్చునని, సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. అనస్థీయా ప్రొఫెసర్ డా.రామశివనాయక్‌మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా నిలబడే సమాజ నిర్మాణానికి సమకరిస్తానని బాధ్యత తీసుకుంటామని తెలిపే ప్రతిజ్ఞను చేయించారు.

కర్నూలు అర్బన్: సీపీఆర్ పైన విద్యార్థులకు అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ ఎలా చేయాలి.. ఎలా చేయకూడదు.. చేసే పద్ధతులు, ఎవరికి చేయాలి.. అనే అంశాలపై విశ్వభారతి మెడికల్ కళాశాల ఈఎన్‌టీ ప్రొఫెసర్ మహేంద్ర కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, రెడ్ క్రాస్ ప్యాకల్టీ సభ్యులు మదన మెహన్, ప్రొఫెసర్లు వింధ్యావాసినిదేవి, ఏ. వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు రూ.2. వేల 700 కోట్లు ఎగనామం పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ విషయంపై తక్షణమే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగర అధ్యక్షకార్యదర్శులు నాగరాజు, బీసన్న, నాయకులు కుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలకు అనుమతులపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాలలకు అనుమతులపై వెంటనే విచారణ చేపట్టాలని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో రాయసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు లేకున్నా అనుమతులు ఇవ్వడంపై వర్సిటీ అధికారులు బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కమిటీ సభ్యులు రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ ఆదేశాల మేరకే తాము అక్రమ అనుమతులు ఇస్తున్నామని చెబుతున్నారని ఆరోపించారు. శారద కళాశాల నన్నూరులో ఉంటే .. బస్తిపాడులో ఎలా అనుమతులు ఇస్తారు. కృష్ణనగర్‌లో ఒకే భవనంలో 3 కళాశాలలకు ఎలా అనుమతులు ఇస్తారంటూ ప్రశ్నించారు. ఉపకులపతి స్పందించని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు భూపాల్, సాయి. కిరణ్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తే కళాశాలలకు గుర్తింపు ఇస్తారా..?

కర్నూలు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డబ్బులిస్తే బీఈడీ కళాశాలకు గుర్తింపు ఇస్తారా అని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మహేంద్రబాబు ప్రశ్నించారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటి ఎదుట ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బీఈడీ కళాశాలకు వ్యతిరేకంగా నిరసర కార్యక్రమం చేపట్టారు. యూనివర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలల గుర్తింపు అవకతవకలపై ఫిర్యాదు చేస్తే ఆధారాలు కావాలని హేళనగా మాట్లాడటం దారుణమని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 28 కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణ, అఖిల్, జనార్దన్, తేజ, బాషా, అన్వర్ పాల్గొన్నారు.

కల్తీ మద్యం ఏరులై పారుతోంది : వైసీపీ


ఎక్సైజ్ సీఐ మంజులకు వినతి పత్రం అందజేస్తున్న ఆదిమూలపు సతీష్

కోడుమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీం మద్యం ఏరులైపారుతోందని వైసీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతోనే రాష్ట్రంలో కల్తీ మద్యం దందా సాగుతుందన్నారు. ప్రతి గ్రామంలో 5 నుంచి 10 బెల్టు షాపులు వెలశాయని చెప్పారు. ఇంటి వద్దకే మద్యం అనే పాలసీ రాష్ట్రంలో కొనసాగుతుందని విమర్శించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ మంజులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, వైసీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, లాయర్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌లో ఈఎన్‌టీ, పీజీ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన పీజీ విద్యార్థులు, వైద్యులతో ప్రిన్సిపాల్

కర్నూలు హస్పిటల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఓటోలాదింగోలజిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగిన సౌత్‌జోన్ సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీలో చదువుతున్న ఈఎన్‌టీ పీజీ విద్యార్థులు సత్తా చాటారు. చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగానికి చెందిన పీజీ తృతీయ విద్యార్థిని డా.దివ్య నాగేశ్వరి క్విజ్‌లో గోల్డ్ మెడల్ టెంపోరల్ బోన్ డిఫెక్షన్‌లో డా.షేక్ షాజియా జబిన్ సిల్వర్ మెడల్ సాధించారు. సౌత్‌జోన్ సదస్సులో మెడల్స్‌ను సాదించిన పీజీ విద్యార్థులను ఈఎన్‌టీ విభాగపు హెచ్‌వోడీ డా.హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.లింగన్న వైద్యులను ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ అభినందించారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌కు ఎంపికైన ఇండస్ విద్యార్థులు


స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచిన ఇండస్ పాఠశాల విద్యార్థులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో మాంటిస్సోరి ఇండస్ పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు ఇన్‌లైన్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి విల్సన్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో విల్సన్, అగస్టీన్, పీఈటీలు, కోచ్ సురేష్, రామ్మోహన్‌లు క్రీడాకారులను అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం


సాఫ్ట్‌బాల్ జట్లతో కార్యదర్శి రాఘవేంద్ర

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో ఉమ్మడి జిల్లాలో అండర్-19 బాల బాలికలకు క్రికెట్, వాలీబాల్, యోగాసన ఎంపిక పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల, కర్నూలుకు చెందిన 200 మంది బాలబాలికలు పాల్గొననున్నారని స్కూల్ గేమ్స్ +2 కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాష్, రమణయ్య సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో రెండో స్థానం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని రేమటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గేమ్స్ తైక్వాండో (అండర్-14) పోటీల్లో ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని టీఎం ఉమ సిల్వర్ మెడల్ సాధించింది. హెచ్ఎం ఆర్.ఈశ్వరీబాయి విజేతను అభినందనలు తెలిపి మెడల్స్ అందజేశారు. పాఠశాల పీఈటీలు జేవీ పద్మలత, సరిత అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలానికి కొత్తగా 43 మంది ఉపాధ్యాయులు

సి. బెళగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సిబెళగల్ మండలానికి కొత్తగా 43 మంది ఉపాధ్యాయులు విధులలో సోమవారం చేరారు. కొత్తగా విధులలో చేరడానికి వచ్చిన ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు మండల ఎంఈవో కార్యాలయానికి చేరుకున్నాయి. అయితే మండల విద్యాధికారి జ్యోతి 12 గంటలకు రావడంతో ఉపాధ్యాయులు 2 గంటల పాటు నిరీక్షణ చేశారు. అనంతరం ఆయా గ్రామాలకు ఇచ్చిన అర్డర్ కాపీని ఎంఆర్‌సీలో అందజేసి గ్రామాలకు వెళ్లిపోయారు.

నేడు ఆలూరుకు మంత్రి సవిత

● ప్రధాని పర్యటనపై ముఖ్య నాయకులతో సమావేశం

ఆలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలూరుకు రానున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి సోమవారం తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన ఈనెల 16న ఉండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో పార్టీ సీనియర్లు, ముఖ్య నాయకులు, మండల కన్వీనర్లు, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మద్దికెర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను జయప్రదం చేయాలని మండల బీజేపీ అధ్యక్షులు బురుజుల శంకర్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, మాజీ బీజేపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు చౌదరి, సుంకు నాగేష్, బాబ్జి గౌడు ఉన్నారు.

పశు సంపదను కాపాడుకుందాం



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారులు

తుగ్గలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పశువులు గొడ్డుమోతుగా ఉన్న పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేసి పశు సంపదను కాపాడుకుందామని పశువైద్యాధికారులు లక్ష్మన్న, బాలకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొందిమడుగులలో రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశు గర్భకోశ వ్యాధుల చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామంలోని 68 గొడ్డుమోతు పశువులకు చికిత్స చేశారు. సర్పంచ్ చౌడప్ప, ప్రతాప్ యాదవ్, సిబ్బంది దాదా ఖలందర్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఆదోని జిల్లా సాధించి తీరుతాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వలసలకు పేరుగాంచిన పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం ఆదోని జిల్లా సాధనతోపాటు, ఆదోని నియోజకవర్గ లోని పెద్ద హరివాణం మండల కేంద్రంగా సాధించి తీరుతామని సామాజిక కార్యకర్త ఆదినారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని రెడ్డీస్ కళ్యాణ మండపంలో వివిధ నాయకులతో ఆదోని జిల్లా, పెద్ద హరివాణం మండలం సాధన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు దస్తగిరి నాయుడు, న్యాయవాది లలిత పాల్గొన్నారు.

ప్రతి రైతుకు పప్పుశనగ విత్తనాలు అందిస్తాం

తుగ్గలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే పప్పుశనగ విత్తనాలను ఎలాంటి కొరత లేకుండా ప్రతి రైతుకు అందిస్తామని ఏవో సురేష్ యాదవ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

పత్తికొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రభుత్వ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడిని సస్పెండ్‌చేయాలని సోమవారం ఏబీవీపి, ఏఐఎస్ఎఫ్ విద్యార్థిసంఘాల నాయకులు పవన్‌కళ్యాణ్ డిమాండ్‌చేశాడు. విద్యార్థులపట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ సోమవారం పాఠశాలముందు నిరసనకు దిగారు. ఈవిషయంపై తహసీల్దార్ హసేన్‌సాహెబ్‌కు ఫిర్యాదును అందించారు.

వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి

మద్దికెర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వ వైద్యాధికారిణిలు రాగిని, శ్రీలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వైద్యులకు మద్దతుగా భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు సీహెచ్‌వో నిరంజన్‌బాబు, జిలాని బాషా, అక్బర్‌బాషా ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయాలి

ఆలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి న్యాయం చేయాలని ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఉపాధ్యాయులకు ఘనస్వాగతం

హొళగుంద, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025లో నియమితులై హొళగుంద మండలం కోగిలతోట గ్రామంలోని జెడ్పీ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరిన 14 మంది నూతన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎసీ కమిటి చైర్మన్ కూడ్లూరు బసవరాజు, వైస్ చైర్మన్ ఇటిగళ్ బసవరాజుతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కొరతతో ఇన్నాళ్లు విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వం డీఎస్సీ నియామకం చేపట్టడంతో ఉపాధ్యాయుల కొరత తీరిందని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

పత్తికొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతుందని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్యక్షతన సోమవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గసమన్వయకమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో అబివృద్దే ప్రదాన ఎజెండాగా చంద్రబాబు పాలనసాగేదని ఈసారి సంక్షేమానికి పెద్దపీటవేసి అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు ఇప్పటికే ప్రజల్లోకి దూసుకెల్లాయని అందులో స్త్రీశక్తి పథకంకింద ఏర్పాటుచేసిన ఉచితబస్సుప్రయాణాన్ని 90శాతం మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే నిరుద్యోగ యువతకు నిరుద్యోగభృతి రూ3వేలు అందించే దిశగా ప్రభుత్వం సిద్దమవుతుందన్నారు. ప్రదానమంత్రి మోది జీఎస్టీలో తీసుకువచ్చిన సంస్కరణలవల్ల రాష్ట్రంలో ప్రతకుటుంబం రూ 15వేలు లబ్దిపొందుతుందన్నారు. జీఎస్టీవల్లకలిగే లాబాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రతిఇంటికివెల్లి వివరించాల్సిన బాద్యత ప్రతికార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. 16న కర్నూలులో జరగనున్న ప్రదానిమోది బహిరంగసభ కార్యక్రమంలో రాష్ట్రంలో నూతనపెట్టుబడులు, కొత్తపరిశ్రమలను ప్రకటించనున్నారన్నారు. ప్రతినియోజకవర్గంనుండి బహిరంగ సభకు పెద్దఎత్తున జనసమీకరణచేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఉన్నాయని ప్రతిగ్రామంనుండి నాయకులు పెద్దఎత్తున జనసమీకరణచేయాలని పత్తికొండ నియోజకవర్గంనుండి 30వేలమందితో కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ పత్తికొండ టీడీపీకి కంచుకోట అని ప్రదాని బహిరంగసభను విజయవంతంచేసేందుకు 30వేలకుమించి జనసమీకరణ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ అబ్జర్వర్ నారాయణస్వామి, ప్రదానిపర్యటన ఇంచార్జీ బాబ్జీ, తుగ్గలినాగేంద్ర, బత్తినివెంకటరాముడు, సాంబశివారెడ్డి, తిమ్మయ్యచౌదరి,రామానాయుడు, జనసేన రాజశేఖర్, బిజేపి గోవర్ధన్‌నాయుడులతోపాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇది రైతు ప్రభుత్వం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, సకాలంలో రైతులకు రాయితీ పప్పుశనగ విత్తనాలు అందించడం జరిగిందని మండల టీడీపీ మాజీ కార్యదర్శి పెరవలి రామాంజులు, సీనియర్ టీడీపీ నాయకులు రాజేశ్వర్ చౌదరి, మెడికల్ తిమ్మప్ప, దేవాలయ చైర్మన్ పారా రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ పప్పుశనగ విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో విత్తనాలు అందక రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో విత్తనాలు పంపిణీ చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రత్యేక చొరవ తీసుకుని మండలానికి 3వేల క్వింటాళ్లు పప్పుశనగ విత్తనాలు మంజూరు చేయించారన్నారు. రైతులందరికీ విత్తనాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మెడికల్ రాము ఉన్నారు.

విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలు



ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు వైసీపీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతుండడంతో, ఆ మద్యాన్ని సేవించిన వారు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, ఎంపీపీ నారాయణదాసు, జడ్పీటీసీ ఉరుకుందమ్మ, పత్తికొండ సర్పంచ్ కొమ్ము దీపిక, నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, మద్దికెర శ్రీను, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మద్దికెర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుల సమయ పాలన పాటించాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయ సమావేశ భవనంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల సపమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్లాలన్నారు. ఎంఈవో-2 మోహన్, మండల యుటీఎఫ్ నాయకులు ఎండి నాగరాజు, విశ్వనాథ్, ఎస్టీయూ నాయకులు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు చేయాలి

ఆలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులపై దుర్భాషలాడిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు నరసప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఐఏఎస్ అధికారిగా సేవలందించిన ఎమ్మెల్యే రామాంజనేయులపై సభలో అమర్యాదగా ప్రవర్తించి అసభ్య పదజాలంతో దూషించిన గుల్ల అరుణ్‌కుమార్‌ను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తంగాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము రామాంజనేయులు, మసాల జగన్, గోవిందు, ఉలిగప్ప పాల్గొన్నారు.

స.హ. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుపరచాలని ముందడుగు వేదిక సంస్థ జిల్లా అధ్యక్షుడు దేశాయ్ చంద్రన్న కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకుమార్, విజయకుమార్, కృష్ణన్న, శ్రీకాంత్, పులికొండ పాల్గొన్నారు.

ఉచితంగా సర్వీస్ రిజిస్టర్ పంపిణీ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ 2025 లో ఉద్యోగాలు సాధించిన నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఎస్టీయూ ఉచితంగా సర్వీస్ రిజిస్టర్ ఎంఈవోలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యుడు ప్రధాన కార్యదర్శి సంకన్న, సుధాకర్, భీమరాజు, రామకృష్ణ, శ్రీనివాసులు జయరాం పాల్గొన్నారు.

'గో బ్యాక్ మోదీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి'

ఆలూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిన నరేంద్ర మోదీ గో బ్యాక్ అని వామపక్షాలు చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు అంజిబాబు, కె.భూపేష్ అన్నారు. సోమవారం సాయంత్రం జ్యోతిబసు కార్యాలయంలో షైన అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంకాల తగ్గింపు ఘన కార్యం గురించి మాట్లాడేందుకు ఈనెల 16వ తేదీన కర్నూలుకు వస్తున్నారని, అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో రాష్ట్రానికి నాలుగు సార్లు వచ్చి రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా మన రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇచ్చిన ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడమే కాకుండా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు చేయడానికి శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం 55 లక్షల కోట్లు ప్రజల నుంచి పన్నులు పిండుకుని 48 వేల కోట్లు భారాన్ని తగ్గించి పండగ చేసుకోమనడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు కె.పి.నారాయణస్వామి, షాకీర్, షైన, కృష్ణ, వెంకటేశ్వర్లు, విఠల్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, రంగన్న, గోపాల్, సిద్ధలింగ పాల్గొన్నారు.

'హామీని నిలబెట్టుకోవాలి'



మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 2019 ఎన్నికల్లో కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు అంజి కోరారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీలోకి చేరుస్తామని హామీ ఇచ్చిన మోదీ ఆరేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఈనెల 16వ తేదీన కర్నూలు పర్యటనకు వస్తున్న ప్రధాని, వాల్మీకులకు ఇచ్చిన వాగ్దానం మేరకు కర్నూలు బహిరంగ సభలోని వాల్మీకులను ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇవ్వాలని కోరారు. నాయకులు జొన్నగిరి బాలన్న, చక్రాళ్ల శీను, దూదేకొండ శివన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ వర్తింపజేయాలి:

ఆలూరు: వాల్మీకి బోయలని ఎస్టీ జాబితాలోకి మార్పు చేసి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు రాంభీంనాయుడు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన వాల్మీకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, వాల్మీకి సంఘం నాయకులు మాదన్న, భాస్కర్, అరికెర వెంకటేశ్వర్లు, అర్థగేరి శీనప్ప, వీరేష్, రామదుర్గం సోమశేఖర్, మొలగవల్లి రంగన్న, నాగరాజు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

హాలహర్వి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న జరగబోయే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వయవహరించాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం అన్నిశాఖల అధికారులతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, ఏపీఓ చక్రవర్తి, ఏపీఎం నాగార్జున, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, కేశన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షకార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్నలు డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించార యూనియన్ నాయకులు గుండు బాషా, కళాశతి, లకి&, లక&మ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పప్పు శనగ విత్తనాలు పంపిణీ

దేవనకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు అవసరమయ్యే పప్పు శనగ రాయితీ విత్తనాలను స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ, ఏవో ఉషారాణి పంపిణీ చేశారు. క్వింటా పప్పుశనగ పూర్తి ధర రూ.7800 గాను 25 శాతం రాయితీతో రూ.5850 లకే ఇవ్వడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, కన్వీనర్ విజయ్‌భాస్కర్ గౌడ్, రామారావునాయుడు, బీజేపీ వెంకట్రాముడు, కిరణ్, ఉచ్చీరప్ప, శాంతికుమార్, తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ పత్తికొండ బాగ్ కన్వీనర్‌గా అశోక్

పత్తికొండ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఏబీవీపీ బాగ్ కన్వీనర్‌గా అశోక్ ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకులు సుమన్, ఎర్రిస్వామిల ఆధ్వర్యంలో పత్తికొండ బాగ్ కన్వీనర్‌గా అశోక్‌ను ప్రకటించారు. అశోక్ ఎన్నిక పట్ల బీజేపీ మండల అధ్యక్షులు కరణం నరేష్ హర్షం వ్యక్తం చేశారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

దేవనకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు సచివాలయం వద్ద బైటాయించారు. సరైన డ్రైనేజీ కాలువలు, రోడ్లు, తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని సీపీఎం నాయకులు పరమేష్, బజారి, కెవీ రాముడు, సుధాకర్ అన్నారు. సరైన డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో , దోమల వ్యాప్తి పెరిపోయిందన్నారు. తాగునీటి సమస్య కుడా అధికంగా ఉందని సచివాలయాధికారులకు వినతిపత్రం అందజేశారు.

కొత్త ఉపాధ్యాయులు వచ్చేశారు



కొత్త టీచర్లతో విద్యాధికారులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వారి కేటాయించిన బడులలో ఎంఈవోల దగ్గర జాయినింగ్ రిపోర్టు తీసుకొని బడిబాట పట్టారు. డీఎస్సీ నియామక ప్రక్రియతో కొత్త గురువులు కొలువు దీరారు. ఆదోని ఎంఆర్‌సీ భవనం అంతా కొత్త ఉపాధ్యాయులతో సందడిగా మారింది. డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి, ఎంఈవో-1 భూపాల్ రెడ్డి, ఎంఈవో -2 శ్రీనివాసులు కొత్త ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేసి జాయినింగ్ రిపోర్ట్‌లను అందజేసి కేటాయించిన బడులకు వెళ్లాలని సూచించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయ కొరతను కళ్లారా గమనించారు. ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నిర్వహించారు. ఆదోని మండలానికి 110 మంది కొత్త ఉపాధ్యాయులు, ఆలూరు 588, మంత్రాలయం 719, పత్తికొండ 233, కౌతాళం 253, కోసిగి 255 మంది ఉపాధ్యాయులు చేరారు. వీరందరికీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతం పలికి పలు సూచనలు చేశారు.

పత్తికొండ: 2025 డీఎస్సీలో ఉద్యోగాలను సాదించిన ఉపాధ్యాయులు 23మంది పత్తికొండ మండలపరిదిలోని ఆయాపాఠశాలల్లో బాద్యతలు స్వీకరించారు. ఎంఈవో కార్యాలయంలో అందించాల్సిన పత్రాలను వారు సాయంత్ర కార్యాలయంలో అందించారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో రాజారామ్మోహన్ అభినందనలు తెలిపి మంచి ఫలితాలు సాధించే దిశగా బోధన చేయాలని సూచించారు. అయితే నూతన ఉపాధ్యాయులను తమ యూనియన్లవైపు ఆకర్షించేందుకు ప్రదాన యూనియన్లు యూటీఎఫ్, ఎస్టీయూ, ఎపిటీఎఫ్‌లు కార్యాలాయానికి తమబ్యానర్లు కట్టారు.

దేవనకొండ: ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీతో మండలానికి నూతన ఉపాధ్యాయులు వంద మంది వచ్చినట్లు ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు. ఎస్జీటీ 85, స్కూల్‌అసిస్టెంట్ 15 మంది వచ్చినట్లు తెలిపారు.

నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ నిరసన తెలియజేశారు. ఎక్సైజ్ సీఐ లలితాదేవికి వినతి పత్రం అందించారు. వైసీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు అరికెర వెంకటేశ్వర్లు, భాస్కర్, గిరి, శ్రీనివాసులు, కొట్టాల రాజు, అరికెర వీరేష్, సోమశేఖర్, నాగేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : కల్తీ మద్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహించి ప్రాణాలతో చెలగాటమాడుతుందని వైసీపీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు కల్తీ మద్యాన్ని అరికట్టాలని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎక్సైజ్ సీఐ సైదులకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫయాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు దేవా, శ్రీలక్ష్మీ, ఏసేపు, శునర్ ఖాదర్, తాయన్న, రామకృష్ణ దేవదాస్, దానం రామకృష్ణ పాల్గొన్నారు.

వలసల పాపం పాలకులదే

దేవనకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతంలో ప్రారంభమైన వలసల పాపం పాలకులదేనని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ అన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను విస్మరించడంతో వ్యవసాయం భారమై మూటముల్లే సర్దుకొని తల్లి పిల్లలు వలసలు వెళ్లడం జరుగుతుందన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే, అధిక వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టం వాటిల్లడంతో నష్టాలను పూడ్చుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు వలసలు వెళ్లడం జరుగుతుందన్నారు. గత ప్రస్తుత ప్రభుత్వాలు వలసల నివారణ చర్యలు చేపట్టడంలో విఫలం కావడం జరిగిందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటే వలసల నివారణ సాధ్యమన్నారు.

ఘనంగా వైకుంఠం శ్రీరాములు జన్మదిన వేడుకలు



ఆస్పరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆస్పరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్‌ల తనయుడు వైకుంఠం శ్రీరాములు జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన ఆస్పరిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఎన్టీఆర్ జెండా కట్ట వద్ద కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి నాయకత్వంతో పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త, నాయకుడు అంకితం కావాలన్నారు. వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం, గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవన్‌కుమార్, తిమ్మన్న, సంజన్న, గోవిందు, శేషరెడ్డి, రవిరెడ్డి, రాఘవేంద్ర, రాజకుమార్, అరవింద పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలి రావాలి



మాట్లాడుతున్న రామచంద్రనాయుడు

దేవనకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 16న నన్నూరు వద్ద జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమీ నాయకుల సమావేశం నిర్వహించారు. టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, రాజశేఖర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు బొల్లెద్దుల కిరణ్‌కుమార్, రవికుమార్, తిమ్మప్ప, జనసేన నాయకులు ఉచ్చీరప్ప ఉన్నారు.

శివారు కాలనీలను అభివృద్ధి చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మిగనూరు పట్ట ణంలోని శివారు కాలనీలను అభివృద్ధి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. సోమ వారం స్థానిక మున్సిపల్ కా ర్యాలయం ఎదుట శివారు కాలనీల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సమీఉల్లా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఎమ్మిగ నూరు ముందుంటుందని చెప్పుకుంటున్న మున్సిపల్ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య శాలలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరి ష్కరించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మ గురుడు, వీరేష్, పట్టణ అధ్యక్షులు విజయేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ సుధారానికి వినతిపత్రం అందజేశారు. శ్రీధర్, వీరేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా హామీ ఏమైంది : వామపక్షాలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి విభజన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకించాలని వామపక్ష నాయకులు రంగన్న, పంపన్నగౌడ్, గోవిందు డిమాండ్ చేశారు. సోమ వారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మోదీ గోబ్యాగ్ కరపత్రాలను వారు విడుదల చేశారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి : వైసీపీ

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యాన్ని ఆరికట్టాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకుడు మురహరి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం వైసీపీ కార్యకర్తలు సోమప్ప సర్కిల్‌లో మద్యం సీసాలతో బైఠాయించి నిరసన చేపట్టి, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా బయలుదేరి స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ, వైస్ ఛైర్మన్ నజీర్, లతారెడ్డి, సునీల్, మధు, చేనేత మల్లి పాల్గొన్నారు.

ప్రధాని సభను జయప్రదం చేయండి

కోసిగి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం వెలుగు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ఏపీవో ఖాలిక్, ఏపీఎం సూర్యప్రకాష్ మాట్లాడుతూ మండలానికి 25 లేదా 50 బస్సులను మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సభకు హాజరు కావాలని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు.

దళితుల అభ్యున్నతికి నిరంతర పోరాటం

గోనెగండ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేస్తామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. సోమవారం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో కులవివక్ష వ్యతిరేఖ పోరాట సమితి 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను అవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రాపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం మారేష్, మునిస్వామి, శంకర్, తిమ్మన్న, మల్లికార్జున, నరసింహులు, రంగన్న, మల్లికార్జున, కృష్ణ, బతకన్న, రోగెన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దకడబూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలం నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని స్థానిక బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. నాయకులు దేవదాసు, హనుమంతు, ఈరన్న, ఓబులేసు, శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ నాయకులు రాజేంద్ర, ఉరుకుందు పాల్గొన్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13గంటల పని విధానాన్ని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 8గంటల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ జిల్లా నాయకులు ఎం సత్యన్న, ఐఎఫ్‌టియు మల్లికార్జున, వీరేష్, వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబానికి అండగా ఉంటా'

నందవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీకి చెందిన నందవరం నాగమ్మ కుటుబానికి అండగా ఉంటానని మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ దేశాయి మాదవరావు అన్నారు. సోమవారం ఆమె భర్త, టీడీపీ నాయకుడు గడ్డ రామన్నతో మాట్లాడుతూ పార్టీకోసం చేసిన సేవలు గుర్తుంటాయన్నారు. సంతాపం తెలిపిన వారిలో వెంకటేశ్వర్లు, బెస్తా ఈరన్న, ఆంజినేయులు, శ్రీనివాసులు, చంద్రబాబు, మోహన్, బంగారి తదితరులు ఉన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయం నందు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

టీడీపీలో బీసీలకు పెద్దపీట

- అభివృద్ధి, సంక్షేమం టీడీపీకే సాధ్యం
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి
- మండల వైస్ ఎంపీపీ రమణకుమారి, ఆమె భర్త మురళీనాయుడు వైసీపీకి రాజీనామా
- ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిక



గోనేగండ్ల వైస్ ఎంపీపీ రమణకుమారి, ఆమె భర్త మురళీ నాయుడు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం



పార్టీలోకి చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు/గోనెగండ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీలో బీసీలకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వ రరెడ్డి అన్నారు. గోనేగండ్ల మండలంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మండల వైస్ ఎంపీపీ రమణకుమారి, అమె భర్త వైసీపీ సీనియర్ నాయకుడు మురళీ నాయుడు, ఆయన సోదరుడు రాఘ వేంద్ర నాయుడు, వారి అనుచరులు వందలాది మంది వైసీపీకి రాజీ నామా చేశారు. వైస్ ఎంపీపీ రమణ కుమారి తన పదవికి, ఎంపీటీసీ-2కు సైతం రాజీనామా చేశారు. ఊహించని విధంగా గోనేగండ్ల వైసీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న మురళీ నాయుడు పార్టీ మారడం చర్చనీ యాంశంగా మారింది. వైసీపీకి రాజీనామా చేసిన మురళీనాయుడు అయన భార్య వైస్ ఎంపీపీ ర మణకుమారితో పాటు దాదాపు 200 మందికి పైగా వైసీపీ నా యకులు, కార్యకర్తలు పెద్దఎత్తున గోనెగండ్లనుంచి వాహనాల్లో ఎమ్మిగనూరులోని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఇంటిదగ్గరకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వర రెడ్డి పీఎం సభ పరిశీలకులుగా వచ్చిన తణుకు ఎమ్మె ల్యే అరిమిల్లి రాధా కృష్ణల సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మె ల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, అలాగే వైస్‌ఎంపీపీ రమణకుమారికి తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే దాదాపు 200 మందిని పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ టీడీపీ అంటే బీసీలని, బీసీలంటే టీడీపీ అని పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు దగ్గర నుంచి నేటి వరకు బీసీలకు టీడీపీలో పెద్దపీట వేస్తున్నార న్నారు. నేడు సీఎం చంద్రబాబు, విద్యామంత్రి నారా లోకేశ్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. ప్రధానంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంతో టీడీపీపై ప్రజలకు ఇతర పార్టీల నాయకులకు నమ్మకం పెరుగుతోందన్నారు. మరళీ నాయుడు, ఆయన భార్య రమణ కుమారి ఎంపీటీసీ -2 పదవికి, వైస్‌ఎంపీపీకి రాజీనామా చేసి రావటం అభినందనీయ మన్నారు. గోనేగండ్ల మం డలం టీడీపీకి కంచుకోట అని పేర్కొన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలా అండదండలు ఉం టాయన్నారు. గోనేగండ్లలో పార్టీని మరింత బలోపేతంగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. టీడీపీలోకి చేరిన మురళీ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభి వృద్ధి సంక్షేమంతోనే తాము టీడీపీలో చేరామన్నారు. ఎమ్మెల్యే బీవీని, తణుకు ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తిరుపతయ్య నాయుడు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వసుధేంద్ర తీర్థుల మధ్యరాధన

మంత్రాలయం, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు వసుధేంద్ర తీర్థుల మధ్యరాధన మహోత్సవాలు కన్నుల పండువుగా నిర్వహించారు. కర్నాటకలోని శిరుగుప్ప కెంచన గుడ్డలో వెలసిన వసుధేంద్ర తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూ జలు చేశారు. సోమవారం వేదపండితుల మం త్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య బృం దావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టువస్త్రాలు, ప్రత్యేక పు ష్పాలతో శోభాయమానంగా అలం కరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారికి హస్తోదకం చేసి పీఠాధిపతి మహా మంగళహారతి ఇచ్చారు. వందలాది మంది పాల్గొన్న భక్తులకు వేదపండితులు వసుధేంద్ర తీర్థుల ప్రవచన సందేశం చేశారు. పీఠాధిపతి శేషవస్త్రం, ఫల, పుష్ప, మం త్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతి

కొత్త గురువులతో పాఠశాలలు కళకళ

- అభినందనలు తెలిపిన రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని పాఠశాలలు కొత్త గురువులతో కళకళలాడుతున్నాయి. అక్ష్యరాస్యతలో వెనుకబడిన పాంతంమైన మంత్రాలయం నియోజకవర్గానికి భారీగా కొత్త ఉపాధ్యాయుల నియామకం పట్ల సీఎం చంద్రబాబుకు, నారా లోకేశ్‌లకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మంత్రాలయం మండలంలో 121 మందికి గాను 93 మంది పాఠశాలలో చేరినట్లు ఎంఈఓలు షైనుద్దీన్, రాగన్న తెలిపారు. కోసిగి మండలంలో 256, కౌతాళం మండలంలో 257, పెద్దకడబూరు 92 మంది కొత్త ఉపాధ్యాయులను కేటాయించడం శుభపరిణామమన్నారు. మంత్రాలయం మండలం వగరూరు ప్రాథమిక పాఠశాలో ఏడుగురు ఉపాధ్యాయులు చేరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించి, ఒకవైపు అభివృద్ధి ఒకవైపు సంక్షేమం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని కొని యాడారు. కొత్త ఉపాధ్యాయులను గౌరవిస్తూ స్కూల్ కమిటీ ఛైర్మన్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగత ఏర్పాట్లుచేపట్టారని తెలిపారు. ఈకార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాజారెడ్డిలు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

కౌతాళం: అక్షరాస్యతలో జిల్లాలో వెనుక మండలాల్లో ఒకటైన కౌతాళం మండలానికి మునుపు ఎన్నడు లేని రీతిలో దాదాపు 253 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించడంతో సోమవారం వారు మొదటిసారిగా విధుల్లో చేరారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు తాయన్న, ఆర్థిక కార్యదర్శి ఖాదర్ భాష, సీనియర్ నాయకులు మహదేవప్ప, వీరచంద్ర యాదవ్, సుంకన్న పాల్గొన్నారు.



మంత్రాలయం: వగరూరు పాఠశాలకు కొత్తగా చేరిన ఏడుగురు ఉపాధ్యాయులు

కోసిగి: కోసిగి మండలానికి 255 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చినట్లు మండల విద్యాధికారి బాలయ్య తెలిపారు. ఎస్‌జీటీ నుంచి 158 మంది, స్కూల్ అసిస్టెట్లు 97 మంది కలిపి మొత్తం 255 మంది విధుల్లో చేరారు. కోసిగిలోని ఎంపీపీ హిందూ గర్ల్స్ పాఠశాలలో ఏడుగురు నూతనోపాధ్యాయులు చేరారు. అలాగే కోసిగికి చెందిన పులిరాజు అనే నూతన ఉపాధ్యాయుడు కందుకూరుకు మొదటిరోజు పాఠశాలకు వెళ్లి సంతకం పెట్టి విధుల్లో చేరారు.

గోనెగండ్ల : మండలంలో 53 పాఠశాలల్లో 12000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే మండలంలోని పలు పాఠశాలలకు 121 మంది ఉపాధ్యాయులు కావాల్సి ఉండగా ప్రభుత్వం నూతనంగా డీఎస్సీ ఎంపిక ద్వార మండలంకు 79 మంది కొత్త ఉపాధ్యాయులు మాత్రమే వచ్చారు. సోమవారం నూతన ఉపాధ్యాయులు గోనెగండ్ల ఎంఈవో కార్యాలయం లో జాయిన్ అయ్యారు. ఇంకా మండలంలో 42 ఉపాధ్యాయ పోస్టు లు ఖాళీగా ఉన్నాయి.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గోనేగండ్ల మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గోనేగండ్లకు చెందిన వైసీపీ నాయకులు మురళీనాయుడు, వైఎస్ ఎంపీపీ రమణి కుమారి, వారి అనుచరులు దాదాపు 200 మంది ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం వారు భాస్కర్ల చంద్రశేఖర్‌ను కలిశారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బీవీ, పార్టీ అన్ని విధాల అండదండగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండ రెపరెపలాడాలన్నారు.



టీడీపీలో చేరిన వారిని అభినందిస్తున్న దృశ్యం

ప్రధాని పర్యటన విజయవంతం కావాలని హోమం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 16వ తేదీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన విజయవంతమ వ్వాలని హోమం చేపటినట్లు గురురాజ్ దేశాయ్, దయాసాగర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని గాయత్రీ దేవి దేవాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం కావాలని, పర్యటన ఎటువంటి అటంకాలు, అంతరాయాలు లేకుండా జరగాలని వేద పండితులతో లక్ష్మీ గణపతి, నవగ్రహ, రుద్రహోమం చేపట్టినట్లు తెలిపారు. మొదట శ్రీశైలంలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శిం చుకొని అనంతరం, కర్నూలులోని నన్నూరులో జరుగు భారి బహిరంగ సభలో దేశంలో జీఎస్టీ తగ్గిన తర్వాత మొట్టమొదటి సభ కారణంగా సూపర్ జీఎస్టీ - సూపర్ సెవింగ్స్ భారీ బహిరంగ సభను ఉదేశించి మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లలిత్ జైన్, బి ఎల్ నారాయణ, రామన్న గౌడ్, బడేసాబ్, చరణ్, శిల్పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రి దేవి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు గురురాజ్ దేశాయ్, దయాసాగర్

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రాఘవేంద్ర రెడ్డి

- మోదీ సభకు 250 వాహనాలతో తరలి వస్తాం



మంత్రాలయం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని సోమవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. రాఘ వేంద్ర రెడ్డి కలిసి సమస్యలు వివరించారు. మోదీ సభకు 250 వాహనాలతో పెద్దఎత్తున తరలివస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం నియోజక వర్గానికి నిధులు మంజూరు చేయాలని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు లేక రైతులు వలసలు వెళుతున్నారన్నారు. మంత్రాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సాగు,తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజి, ఆర్ అండ్‌బీ రోడ్లు, అన్న క్యాంటీన్ పాఠశాలలు, హాస్టళ్ల ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మంచాల సింగిల్‌విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ యువనాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

నిధులను దారి మళ్లించొద్దు: ఐఎఫ్‌టీయూ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును యథావిధిగా కొనసాగించాలని, ఆ నిధులను దారి మళ్లించాలనే ప్రయత్నాన్ని మానుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నా యకుడు బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ జోతీర్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యన్న, బాబు, మల్లికార్జున, వీరేష్, వీరారెడ్డి, రాజేంద్ర, బజారి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు : ఎంపీడీవో

మంత్రాలయం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీ వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలని ఎంపీడీఓ నూర్జహాన్, ఆదోని కమర్షియల్ ట్యాక్స్ అధికారి నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మంత్రాలయంలో జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ మేకల వెంకటేష్, అండే హనుమంతు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, వెలుగు సీసీ చాముండేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

గోనెగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ప్రకటించిన సీఎస్టీ తో గణనీయంగా నిత్యవసర వస్తువులు, ఎలెక్ట్రానిక్ వస్తువుల, మరియూ ఇరత సామగ్రి ధరలు తగ్గనున్నాయని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. సోమవారం గోనెగండ్లలో నూతన జీఎస్టీ 2.0 పై ప్రజలలోకి తీసుకెళ్లే అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

రజిత గజవాహనంపై ప్రహ్లాదరాయలు



మంత్రాలయం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం కార్తీక సప్తమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆ .ధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృం దావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య రజిత గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

ఆలయాల పునః నిర్మాణానికి భూమి పూజ

కౌతాళం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఉన్న అంజనేయ స్వామి, బసవన్న గుడిల పునః నిర్మాణానికి సోమవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈవో వాణి భూమిపూజ చేపట్టారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున స్వామి, వెంకటేశ్వర్లు, అధికారులు కిరణ్, విజయ్, కుమార్ ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి పాల్గొన్నారు.

నాన్ లే అవుట్ల వల్ల సమస్యలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గతంలో నాన్‌లే అవుట్లు వేయటం వల్ల వర్షం వచ్చినప్పుడంతా ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన తిరుమల నగర్, సాయిగణేష్, నెహ్రూనగర్ కలనీలలో మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇష్టానుసారంగా నాన్ లే అవుట్లు వేయటం వల్ల రోడ్లు, డ్రైనేజీలు లేకపోవటంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిలిచి పోతున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, నాయకులు బిజ్జే నాగరాజు, ప్రతాపరెడ్డి, పందికోన ఈరన్నలు ఉన్నారు.

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత చంద్రబాబుదే

ఎమ్మిగనూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయంలో నిర్వీర్యమైన ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత సీఎం చం ద్రబాబుదేనని తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ సమావేశానికి పరిశీలకుడుగా తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15నెలల కూ టమి ప్రభుత్వ కాలంలో రాష్ట్రానికి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు ఎన్నో పరిశ్రమలు, కోట్ల రుపాయల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, బీజేపీ నాయకులు నరసింహులు, ఈరన్న, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరిమిల్లి రాధాకృష్ణ

పదోన్నతులు కల్పించే వరకు పోరాటం

గోనెగండ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు కల్పించే వరకు పోరాటం చేస్తామని సీహెచ్‌వో మేరి గోల్డ్, ఎంపీహెచ్‌వో హనుమంతు, సుధాకర్ అన్నారు. సోమవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులకు మద్దతుగా సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో, ఎంపీహెచ్‌సీ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సూపర్‌వైజర్‌లు లక్ష్మీకాంతమ్మ, శాంతమ్మ, పీహెచ్‌ఎన్ భారతి విజయలక్ష్మి, ఎంపీహెచ్‌సీ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.